వలె నామెముఖము క్రొందళ్కు-లఁ గుమ్మరించుచున్నది. ఆమెకదలికల వినూత్న సౌరభమ్ములు వెడలుచున్నవి.ఆమె నవీనత, ఆమెసౌందర్యము, ఆమె వాత్సల్యము, తిలకించి నేను పులకించితిని. విశ్వాసమునఁ గరఁగిన నాహృదయము క్రొత్త గీతముల నాలపెంచినది. వాని రాగభేద మెఱిఁగి యామె బంగరువీణతీవల బిగించి శ్రుతిమీటినది. రసతరంగములలోలోన నిమిడ్చికొనలేక కంఠమెత్తి కావ్యముల రచించితిని. ఆమె వానినెల్ల నందే స్వర్ణాక్షరముల లిఖించినది. అప్రయత్నముగ జారిన నానుడుల నెల్ల నామె యాణిముత్తెములపేరుగ నలంకరించికొనినది. ఆమె నాకు కానుక నొసంగవచ్చిన ఉగాదిదేవతయని నేను సవినయమ్ముగ లేచి నిలిచి వంగి యామెకు నమస్కరించితిని. ఆమెపదతలమ్మున నామొగమునీడఁ జూచికొంటిని. తన మృదుకరమ్మున నాశిర మంటి ఆమె నన్నాశీర్వదించినది. మొగిడ్చిన నాముంజేతుల నామె పూదండ యిడినది. పులకించిన నామేన భూషణమ్ము లెన్నో తొడిగినది. కట్టికొన్న నాతెలిమడుగు పీతాంబర మయినది. నాపర్ణకుటీరము స్వర్ణకుటీర మయినది. నాతేటకన్నీటిబొట్లు ముక్తాహారము లయినవి. కటికిపేదకు కనకాభిషేక మయినది.

ఇది ఉగాదినాఁటి తొలిప్రొద్దువెలుఁగురేక. ఇదె నా ఉగాదికానుక.

---

# తామస ప్రణయము

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

స్వాగతగీతముల్ పాడ కుల్లాసమ్ము పొంగు చల్లార్పవే ముద్దుపికమ!
"త్రోవతప్పితివోయి బావయ్య!" యని పెడదారిఁ ద్రొక్కి-ంపవే గోరువంక!
"విషపుసవ్వులు కట్టిపెట్టుమింక" నటంచుఁ గండ్లెఱ్ఱజేయవే గండునెమలి!
గుమ్మ మెక్కి-నయెడఁ గొంకక "పోపొమ్ము రావ"ద్దనంగదే రామచిలుక!
చిల్లునడె వీనుదోయి, గుభిల్లుమనియె - నుల్ల మాలింపనాలింప గొల్లకతలు,
ఉడికియున్న నాకన్నులఁ బడకమున్న - నంపివేయుఁడు నెచ్చెలులార! వాని.

---